క్లుప్తంగా

భవిత సెంటర్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

దొనకొండ: స్థానిక భవిత సెంటర్‌ను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నాగేంద్ర నాయక్, ఏపీఓ జాలిరత్నం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు పరిశీలించారు. తగు సూచన, సలహాలందించారు. భవిత సెంటర్ పని తీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.ఉషా, సీఆర్‌పీ చెంచిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై దృష్టిసారించాలి



కూలీల హాజరును పరిశీలిస్తున్న ఝాన్సీరాణి

తాళ్లూరు: రాబోతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కూలీలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగేలా చూడాలని జిల్లా విజిలెన్స్ అధికారి పాకల ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని దోసకాయలపాడు, మల్కాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఫారం పాండ్ పనులు, కూలీల హాజరును పరిశీంచారు. ఇంకుడు గుంతలు నిర్మించాలని విజిలెన్స్ సూపరింటెండెంట్ వెంకటస్వామి సూచించారు. ఏపీఓ మురళి, ఈసీడీలు గురుబాబు, కోటేశ్వరరావు, రమేష్, ఏఫ్‌ఏ శ్యాంసన్, ఎం. సుజాత పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



గ్రీవెన్స్‌కు హాజరైన డీటీ

పుల్లలచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు సోమవారం అధికారులు కరువయ్యారు. మండల స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తే ప్రజలు వచ్చి సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుగా ఉంటుందని ఉన్నతాధికారుల భావన. అయితే ఇందుకు విరుద్ధంగా మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్‌కు తూతూమంత్రంగా హాజరవుతున్నారు. తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో అడిగే వారు లేక ఇతర మండలస్థాయి అధికారులు సమావేశాలకు రావడం మానుకున్నారు. కనీసం జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోక పోవడంతో మండలంలోని రెవెన్యూ సమస్యలు పెరుకుపోయాయి. ఉన్నతాధికారులు మాత్రం మార్కాపురం తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా వేసి చేతులు దులుపుకున్నారు. ఆయన కార్యాలయానికే రావడం లేదు. అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నడిరోడ్డుపై మినీలారీ బోల్తా

- తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన మినీలారీ

దర్శి (కురిచేడు): పొదిలి వైపు నుంచి అద్దంకికి పాత సీసాలు, ప్లాస్టిక్ లోడుతో వెళ్తున్న మినీలారీ స్థానిక గడియార స్తంభానికి కూతవేటు దూరంలో నడిరోడ్డుపై సోమవారం రాత్రి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా మినీలారీ ముందు ఇంజిన్ ఉన్న క్యాబిన్ వరకు ఊడిపోయి వెనుక లోడుతో ఉన్న బాడీ వరకు పక్కకు పడిపోయింది. ఓవర్ లోడుతో ఛాయిస్ విరిగిపోయి బాడీ, క్యాబిన్ వేరై ఉంటాయని చూసిన వారు చర్చించుకుంటున్నారు. దాని కింద రెండు రిక్షాలు, ఒక స్కూటీ పడిపోయింది. మనుషులకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ గంటపాటు నిలిచింది. ఎస్సై మురళి తన సిబ్బందిని రంగంలోకి దింపి ట్రాఫిక్‌ను క్రమద్ధీకరింపజేశారు.

పుల్లలచెరువులో రెండు పరీక్ష కేంద్రాలు

పుల్లలచెరువు: పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి జరుగనున్న నేపథ్యంలో మండలంలో రెండు చోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ గతంలో మూడుచోట్ల పరీక్షలు జరిగేవని, కానీ అధికారుల ఇచ్చిన ఆదేశాలపై స్థానిక జెడ్పీ, పాతశాల, పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలల్లో మాత్రమే ఈ ఏడాది పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో మొత్తం 410 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే
- నిర్లక్ష్యంగా ఉంటే జరిమానాతో పాటు లైసెన్స్‌లు రద్దు
- ప్రాణనష్టం తగ్గించేందుకే కఠిన ఆంక్షలు



హెల్మెట్ వాడకంపై పోలీసుల బైక్ ర్యాలీ (ఫైల్)

పుల్లలచెరువు:

రోజు రోజుకూ పెరిగిపోతున్న రహదారి ప్రమాదాలతో ప్రాణనష్టం తగ్గించేందుకు అధికారులు మోటార్ వాహనాల చట్టాలను కఠినతరం చేసింది. న్యాయ స్థానం ఉత్తర్వుల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచి నూతన మోటారు చట్టం అమల్లోకి వచ్చింది. రహదారి ప్రమాదాలు తగ్గించడంతో పాటు వాహన చోదకుల్లో రహదారి ప్రమాదాలపై అవగాహన పెంపొందించి వేగ నియంత్రణను అదుపులోకి తెచ్చేందుకు చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మార్చి 1 నుంచి మోటారు వాహన చట్టం పక్కాగా అమలు చేస్తామని చెబుతున్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడంతో పాటు తరుచూ చట్టాన్ని ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకే

నిత్యం వాహన చోదకులు అతివేగంగా వెళ్తూ తమతో పాటు ఇతరులను సైతం ప్రమాదాలకు గురిచేయడం, మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై కన్నవారికి కడుపుకోత మిగిల్చడం, అతివేగంగా వాహనాలు నడిపి పలువురిని ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిల ఆగడాలను నిరోధించేలా నూతనంగా చట్టాన్ని అమలు చేయాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీంతో మార్చి 1 నుంచి కఠినంగా అమలు చేస్తున్నట్లు పోలీసు, రవాణాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ప్రజలు, ప్రజాసంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

వాహనం సీజ్‌కూ వెనకాడేది లేదు

తరుచూ చట్టాన్ని ఉల్లంఘించే వాహన చోదుకులపై అధికారులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. డ్రైవింగ్ లైసెన్స్‌లను కూడా రద్దు చేయనున్నారు. అదే విధంగా 90 రోజుల్లోపు జరిమానాలు చెల్లించని వాహనాలను సీజ్ చేయనున్నారు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాల్సిందేనని చట్టంలో పొందుపరిచారు. లేని పక్షంలో జరిమానా చెల్లించక తప్పదు. నూతన చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో దానికి అనుగుణంగా పోలీసుల సాఫ్ట్‌వేర్ కూడా అప్‌డేటైంది. దీని ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, రవాణా శాఖ అధికారులతో గొడవలకు దిగినా, సమాచారం ఇచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేస్తారు.

నిబంధనలు పాటించాల్సిందే:



రహదారి ప్రమాదాలను నివారించి ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు న్యాయస్థానం నూతన వాహన చట్టాన్ని అమలు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. మార్చి నుంచి నూతన చట్టం అమల్లోకి వచ్చింది. హెల్మెట్‌తో ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురైనా ప్రాణాపాయం నుంచి సులభంగా బయట పడొచ్చు. తరుచూ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తూ హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి వాహనచోదకుడు రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్‌ను తప్పని సరిగా వినియోగించాలి.

సంపత్‌కుమార్, ఎస్‌ఐ, పుల్లలచెరువు



గాలి నాసర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు

నాసర్‌రెడ్డికి తాటిపర్తి పరామర్శ

పెద్దదోర్నాల: అనారోగ్యానికి గురై కోలుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాలి నాసర్‌రెడ్డి కుటుంబ సభ్యులను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో నెల రోజుల పాటు గుంటూరు వైద్యశాలలో చికిత్స పొంది ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న గాలి నాసర్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే.. ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. నాసర్‌రెడ్డి కుమారుడు నారాయణరెడ్డితో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి, మండల నాయకులు చిట్టె వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నారాయణరెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి ఇంట జరిగిన ఓ శుభకార్యక్రమానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరయ్యారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమీక్ష

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలు మంగళవారం దర్శిలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని పార్టీ కార్యాలయ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీలు, దర్శి పట్టణ కమిటీ నిర్మాణంపై నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, కమిటీల సభ్యులు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

కురిచేడు: దర్శిలోని పొదిలి రోడ్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగే ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనరు ఎన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి బూచేపల్లి సూచనలు చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ



విద్యార్థినులకు మెటీరియల్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

దర్శి (కురిచేడు): మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్ మస్తాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలో, అత్యధిక మార్కులు ఎలా సాధించాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. మెటీరియల్‌తో పాటు ప్రీ ఫైనల్లో మొదటి, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు రాజశేఖరరెడ్డి అందించారు. పబ్లిక్ పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన వారికి రూ.3 వేలు, రూ.2,500, రూ.2 వేలును చింతా తిరుపతిరెడ్డి బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, డైరెక్టర్లు పి.రాజశేఖరరెడ్డి, సుబ్బారెడ్డి, సుశీలమ్మ, తిరుపతిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మను సన్మానిస్తున్న దొనకొండ నాయకులు



ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లిని సన్మానిస్తున్న కురిచేడు నాయకులు

దొనకొండ: ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి తన అనుచరులతో మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి బొకేలు అందజేశారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి పని చేస్తానని కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా యాక్టివ్ సెక్రటరీ బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జి కాలూరి రమణయ్య, భీమినేని వెంకటేశ్వర్లు, కన్నెధార వెంకట సుబ్బయ్య, పాతకోట కోటిరెడ్డి, గుంటు జాకోబు, బాపనపల్లి శ్రీను, ఆంజనేయులు, ఇండ్ల శ్రీనివాసులు, గొంగటి పోలిరెడ్డి, వడ్లమూడి బుజ్జి, పులిమి శివ, గుంటు పోలయ్య, కె.ప్రసాద్, ఐలూరి శ్రీనివాసరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, గుమ్మా వెంకటేశ్వర్లు, ద్వారకచెర్ల చెంచిరెడ్డి, ఢిల్లీ కోటిరెడ్డి, విప్పర్ల సుబ్బయ్య, విప్పర్ల చిన్న మల్లయ్య, వీరాచారి, గొంగటి మహేష్‌రెడ్డి, నగేష్, తెల్లయ్య ఉన్నారు.

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి చీమకుర్తిలోని కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులు సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో నూతనంగా కన్వీనర్ ఎంపిక సందర్భంగా ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శివప్రసాద్‌రెడ్డిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, నాయకులు మేరువ పిచ్చిరెడ్డి, పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, కర్నాటి వెంకటరెడ్డి, రమణారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, ఆసుపల్లి చెన్నారెడ్డి, కొలూరి నర్సింహ, బొమ్మనబోయిన ఆంజనేయులు, సాదం నాసరయ్య, ఎన్వీ నాగిరెడ్డి, తాటి చెంచయ్య, తాటి పాపయ్య, తాటి ఏడుకొండలు, కె.సంతోష్‌కుమార్ ఉన్నారు.

శ్రీకాళహస్తీశ్వరునికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి ఇచ్చే హారతిని తిలకిస్తున్న భక్తులు



అభిషేకం చేస్తున్న పూజారి సుబ్బారావు

కురిచేడు: స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గుణ ఏకాదశి సోమవారం సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంకాలం స్వామివారికి ఏక హారతి, పంచ హారతి, ఏకాదశ హారతి ఇచ్చారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి అభిషేకాలు చేయించి హారతులు తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ఉన్నత చదువులకు పదో తరగతి తొలిమెట్టు



జ్యోత్స్నప్రియను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెద్దారవీడు: ఉన్నత చదువులకు పదో తరగతి తొలిమెట్టు వంటిదని, విద్యార్థులు ఇక్కడ సాధించిన ఫలితాలపై భవిష్యత్ ఆధారపడి ఉంటుందని లయన్స్ క్లబ్ ప్రసిడెంట్ టీవీ రామకృష్ణ అన్నారు. మార్కాపురం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో మండలంలో ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను హెచ్‌ఎం షేక్ అహ్మద్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రసిడెంట్ మాట్లాడుతూ చదువు ఒక్కటే జీవితాలను మార్చగలదని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, క్రమశిక్షణతో చదువుకుని మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైన 8వ తరగతి విద్యార్థిని డి.జ్యోత్స్నప్రియను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. లయన్స్ క్లబ్ కోశాధికారి బీవీ రంగయ్య, డైరెక్టర్, ఉపాధ్యాయులు శ్రీరంగాచారి, గోపాల్, సభ్యులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీని పరామర్శించిన కేపీ



వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మాజీ ఎంపీపీ మానం వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి సోమవా రం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనలేకపోయినప్పటికీ సలహాలు సూచనలు అందించాలని కోరారు. కేపీ వెంట కౌన్సిలర్ మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడి నిందితులను శిక్షించాలి

మార్కాపురం: అన్నమయ్యజిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని హిందూ చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిద్దలూరులో నిరసన ప్రదర్శన నిర్వహించి, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. హిందూ సంఘాల ప్రతినిధులు పీవీ కృష్ణారావు, శాసనాల సరోజిని, బి.చంద్రశేఖర్, జె. శ్రీనివాసులు, ప్రవీణ్, లక్ష్మీదేవి తదితరులు మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న ఏకపక్ష దాడులను ఖండిస్తున్నామన్నారు. గత ఆరు నెలలుగా పెడన, రాయచోటి, వి.కోట, దాచేపల్లి తదితర ప్రాంతాల్లో ప్రశాంతంగా పండగలు చేసుకుంటున్న హిందువులపై కొందరు దాడులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు పక్షపాతం చూపకుండా బాధితలకు న్యాయం చేయాలని కోరారు.

దారి వివాదంలో అన్నవదినపై దాడి



గాయపడిన పెద్ద సుందర్ నాయక్



సామ్రాజ్యం బాయి..

ముండ్లమూరు (కురిచేడు): పొలానికి వెళ్లే దారి విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి అన్న, వదినపై తమ్ముడు, మరికొందరు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన మండలంలోని పలుకురాళ్ల తండాలో ఆదివారం జరిగింది. క్షతగాత్రుల కథనం ప్రకారం.. పలుకురాళ్ల తండాకు చెందిన పెద్ద సుందర్ నాయక్‌కు ఇద్దరు తమ్ముళ్లు. వారి తండ్రి తలా 50 సెంట్ల సాగుభూమి పంచి ఇచ్చాడు. ఆ భూమికి ముగ్గురూ కలిసి మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. పెద్ద సుందర్ నాయక్ చిన్న తమ్ముడు వెంకట్రావు నాయక్ ఆ రోడ్డును జేసీబీతో పగలగొట్టాడు. ఆ విషయమై వివాదం జరిగింది. పెద్ద సుందర్ నాయక్, ఆయన భార్య సామ్రాజ్యం నాయక్‌పై తమ్ముడు, మరదలు, ఇతర బంధువులు దాడా చేసి గాయపరిచారు. క్షతగాత్రులు పెద్దగా కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు వచ్చి కాపాడి చికిత్స కోసం అద్దంకి వైద్యశాలకు తరలించారు. అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తులపై దాడి అమానుషం



హిందువుల నిరసన ర్యాలీ

దొనకొండ: అన్నమయ్య జిల్లా రాయచోటి వీరభద్రస్వామి ఊరేగింపు ఉత్సవంలో భక్తులపై రాళ్లతో దాడి చేయడాన్ని భైరవానందస్వామి ఖండించారు. మెజార్టీ ప్రజలైన హిందువులను దూషించడం మంచిది కాదన్నారు. దాడి చేసిన వారిని వదిలేసి హిందువులను అరెస్టు చేయటం తగదని, ఇప్పటికైనా హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com